


సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 20 జూన్, 2023 సంచిక : 1



**సంస్థాపకులు :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**
**సంస్థాపక సంపాదకత్వం :**
**శ్రీ మాతా శుకవాణి**
**ప్రధాన సంపాదకత్వం :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ**
**ప్రత్యేక సహకారం :**
**డా॥ జి.చంద్రారెడ్డి** M.A, M.Ed., Ph.D
**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**
**శ్రీమతి పి.వి. ధనలక్ష్మి (డి.టి.పి)**
**ప్రచార సారథ్యం :**
**శ్రీ బి. గోపీకృష్ణ**
**శ్రీమతి బులుసు జయ**

**సాయివాణి చందా వివరాలు**
రెండు సంవత్సరాలకు చందా..రూ॥200/-
10 సం.రాలకు చందా........ రూ॥1000/-



**చిరునామా :-**

**సాయివాణి**

**సాయిధామం, బొమ్మల రామవరం మండలం,**
**యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.**
**Ph : 9440413455, 9848133565**



**Online Donations :**
**SRI SAI SEVA SAMITHI TRUST**
**A/c No.62002652136**
**SBI Keesara Branch,**
**IFSC Code : SBIN 0020639**


**విషయసూచిక** **పుట సంఖ్య**


మా వాణి .......... 2
ఆశ్రమ భిక్ష పథకం .......... 6
శాశ్వత ధర్మగోప్త .......... 7
సాయిభక్త దాసగణు .......... 10
శ్రీ సాయి నిత్య పారాయణ .......... 13
PRAYER AND ITS EFFICACY 15
అనఘా వ్రత మహిమ .......... 19
అసూయ .......... 24
గతం లేనిదే భవిష్యత్తు లేదు .......... 26
ఎవరికెవరు ఈ లోకంలో .......... 29


ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.







# మా వాణి





## మసీదులో ముగ్గురు

ప్రియ సాయి మిత్రులందరికీ సాదర ప్రణామం!

సాయిధామం ఆవరణలో పిల్లలు ఆడుకుంటున్నారు. ఒకడు మధ్యలో ఆట ఆపి జేబులోంచి చాక్లెట్ పైకి తీసి పేపరు ఊడదీసాడు. వాడు దాన్ని నోట్లో వేసుకోబోయే సమయానికి మరో పిల్లవాడు అటు చూచాడు. పరుగెత్తుకు వచ్చి చెయ్యి చాపాడు. మొదటివాడు ఏ మాత్రం సంకోచించకుండా, ఆలోచించకుండా సగం చాక్లెట్ తుంచి వీడి చేతిలో పెట్టి మిగతాది తన నోట్లో వేసుకున్నాడు. చూస్తుంటే ముచ్చటేసింది. ఎంత సహజంగా, ఎంత నిరాడంబరంగా దానం చేశాడు ఆ చిన్న పిల్లవాడు! వాడికి శాస్త్రాలు, వేదాలు తెలియవు. మానవతా విలువలు, మంచి చెడ్డలు ఎరుగడు. అయినా అత్యంత సహజంగా పొరుగువాడితో తనకు ఉన్నదాన్ని పంచుకోగలిగాడు. అది వాడి సంస్కారం. పెద్దలమందరం ఇలా చేయ గలుగుతున్నామా?

గీతాకారుడు దానాన్ని మూడు రకాలుగా వివరించాడు.

“దాతవ్యమితి యద్దానం దీయతేనుపకారిణే!

దేశే కాలేచ పాత్రే చ తద్దానం సాత్త్వికం స్మృతమ్ ॥”

దానం చెయ్యాలన్నది కొందరికి ప్రకృతి సిద్ధంగా వచ్చే ఒకానొక లక్ష్యం. అలా ‘ఇవ్వాలి’ అని మనస్సులో నుండి వచ్చే ప్రేరణ వలన ఇచ్చే దానం సాత్త్విక దానం. దేశ, కాల పాత్రతలను అంటే పుణ్యక్షేత్రాలను, తీర్థాలను, ఆశ్రమాది ప్రదేశాలను, నదీతీరాలను దర్శించి చేసే దానం ఉత్తమం. అలాగే పుణ్యతిథులలోను, అర్హత ఉన్న వానికి, అవసరం

సరియైనదై, తిరిగి మనకు ఏమీ ఇవ్వలేని వాడైతే అది సాత్త్వికం, సర్వశ్రేష్ఠం అయిన దానం.

"యత్తు ప్రత్యుపకారార్థం ఫలముద్దిశ్య వాపునః ।

దీయతే చ పరిక్లిష్టం తద్దానం రాజసం స్మృతమ్" ॥

ఫలితాన్ని ఆశించి చేసే దానంగాని, మనస్సులో ఏదో ఇబ్బంది పెట్టుకొని ఇచ్చే దానాన్ని గాని రాజసదానం అంటారు. ప్రత్యుపకారం అంటే తిరిగి మనకు వస్తుంది అనో, ఇంతకింత దేవుడు ఇస్తాడులే అనో బోలెడంత కీర్తి, ప్రతిష్ఠ వస్తాయనో లేక పుచ్చుకున్నవారు మన పట్ల విశ్వాసంతో, గౌరవంతో ఉంటారనో, యిలా ఏదో ఒకటి ఆశించి చేసే దానం శ్రేష్ఠం కాదు. ఈ విషయంలో గీతామకరందం "ప్రత్యుపకారమభిలషించి చేయు దానము బజారులోని వ్యాపార విధానమే కాగలదు" అని తెగేసి చెప్పింది. అంతేకాక పరిక్లిష్టం అంటే మనస్సులో ఆ ఇస్తున్న వస్తువు పట్ల అభిమానం పోకుండానే ఇవ్వడం, ఇవ్వవలసి వచ్చిందే అని మనస్సులో బాధపడుతూ ఇవ్వడం-ఇది కూడా రాజస దానమే అవుతుంది. ఇకపోతే -

"అదేశకాలే యద్దానమ్, అపాత్రేభ్యశ్చ దీయతే ।

అసత్కృతమదజ్ఞాతం తత్తామసముదాహృతమ్ ॥"

దానం చేసేటప్పుడు సత్కార భావనతో, మర్యాదతో, గౌరవాదరాలతో స్వయంగా పరమాత్మునికే ఇస్తున్నామన్న భక్తి భావనతో ఇవ్వాలి. తిరస్కార భావంతో, అలక్ష్యంతో "పో! తీసుకు పో!" అన్నట్లు యాచకుల మొహాన కొట్టినట్లు ప్రవర్తించకూడదు. అది తామసదానం. అలా ఇచ్చేది ఇవ్వని దానితో సమానమే అని భావించిన కృష్ణుడు -

"అశ్రద్ధయా హుతం దత్తం .... అసదిత్యుచ్యతే ।"

అశ్రద్ధతో చేసే పనిలో భగవంతుడు ఉండడు. అందునా సాయిబాబా పదే పదే అశ్రద్ధతో చేసే పనిలో భగవంతుడు ఉండడు. అందునా సాయిబాబా పదేపదే శ్రద్ధా సహనాల గురించి హెచ్చరించిన పరదైవం.





అంచేత అశ్రద్ధ అన్నది స్వామి సేవలో ఎక్కడా పనికి రానేరాదు. అంచేత తామసదానం విడువదగినది.

"ఈశావాస్యమిదగ్ం సర్వం యత్కించిత్ జగత్యాం జగత్

తేనత్యక్తేన భుంజీథా మాకృథః కస్యస్విద్ధనమ్ ॥"

అన్నది ఈశావాస్యోపనిషత్ సృష్టి అంతా భగవంతునితోనే నిండి ఉంది. ఇక్కడి సంపద ఎవడి సొంతమూ కాదు. త్యాగబుద్ధితో ఇతరులకు ఇచ్చి మరీ తినాలి అని ఉపదేశిస్తున్నది.

"నీ ఆస్తికి, ధనానికి నీవు ధర్మకర్తవు మాత్రమేగానీ హక్కుదారుడవు కావు" - అని గాంధీజీ ఎప్పుడూ అంటుండేవారు. ఈ దేశంలో హిందూ సాంప్రదాయంలో దానం ఇవ్వడమనేది ఒక ఖచ్చితమైన సంప్రదాయం, రూల్. దాన్ని పాటించని వారు దారి తప్పుతున్నట్లు, పాటించిన వారు మార్గంలో ఉన్నట్లు మాత్రమే. కానీ ఏదో విశేషకార్యం చేసినట్లు మాత్రం కాదు. ఎవరి సొమ్ము ఎవరు ఎవరికి ఇస్తున్నట్లు. అది - అంటే దానం - అదే ట్రాన్స్ఫర్ ఆఫ్ థింగ్స్ ఆర్ మనీ - భగవదిచ్ఛ వలననే జరుగుతుందనీ, మనం కేవలం నిమిత్తమాత్రులమనే మర్చిపోవటం కేవలం అమాయకత్వం మాత్రమే. "తన సొమ్ము తనకీయ నాకేటి వెఱపు" అనే భావం పొదుకొన్నవాడు ఈ అమాయకత్వం నశించిపోతుంది.

సాయిధామంలో ఒకనాడు గురుదేవులు కూర్చునే కుర్చీ ప్రక్కనే బాబా పటం ముందు చిన్న కాగితం పొట్లం పెట్టి ఉంది. ఉదయం 11 గం.ల నుంచీ అక్కడే ఉంది. ఎందరో భక్తులు స్వామీజీ దర్శనానికి వస్తూ పోతూ ఉన్నారు. ఎవరో ఏ పటికబెల్లమో పెట్టి వెళ్ళుంటారు అనుకున్నారందరూ. సాయంత్రం 5 గం.లు దాటిన తర్వాత అందరూ వెళ్ళిపోయారు. అన్నీ సర్దుతూ ఆ పొట్లం విప్పి చూశాం. చూస్తే 20 వేల రూపాయలు అన్నీ వెయ్యి రూపాయల నోట్లు ఉన్నాయి అందులో. "ఇది బాబాకే ఆయనది" - అని ఉంది తప్ప దాతల పేరు లేదు. ఇది సాత్త్విక దానం. బాబా

హృదయాన్ని కదిలించగల దానం. కృష్ణుడు సర్వశ్రేష్ఠమని సెలవిచ్చిన దానం.

అయితే కొందరు భక్తులు (ఈ అలవాటు పూర్వం చాలా ఎక్కువగా ఉండేది. ఈ మధ్య అంతగా కన్పించటం లేదు) దైవక్షేత్రాలలో రాళ్ళు పరిపించి, వాటిపైన పేర్లు చెక్కించుకొనే వారు. వచ్చిపోయే పుణ్యాత్ముల పాదస్పర్శతో తమ పేర్లు పునీతం కావాలని వారి ఆకాంక్ష. అలాగే కొందరు దాతలు (అసలు పుణ్యక్షేత్రాలలో 'దాతలు' అనటం కన్నా 'సమర్పకులు' అంటే బావుంటుంది) తమ పేర్లు - అక్కడక్కడా ఫొటోలు కూడా ఆయా దేవాలయాలలోగానీ, సత్రాలలో గానీ ఉండాలని కోరుకుంటారు. భూమి మీద ఎంతకాలం మన పేరు తలుచుకుంటూ ఉంటే అంతకాలం స్వర్గంలో మనం ఉంటామన్న విశ్వాసం దీనికి మూలం. అంతవరకూ ఫరవాలేదు గానీ -

"నేనిచ్చా, నేనిచ్చానని అదే పనిగా ప్రచారం చేయించటం" నేనిచ్చిన దాన్ని తీసుకున్నవారు పదే పదే స్మరిస్తుండాలి. నన్ను చూసి .... గౌరవిస్తుండాలి" అనుకోవటం వలన మన దానం తామసదానం అయి పోయి, సత్ఫలితాలకు బదులు దుష్ఫలితాలను ఇచ్చే ప్రమాదం ఉంది. అంచేత ప్రియ మిత్రులారా, యీ భావం - అహంభావం మన దానంతో జతపడకుండా జాగ్రత్తపడదాం.

**శ్రద్ధయాదేయం - వినయంతో ఇవ్వాలి**

**అశ్రద్ధయా అదేయం - అలక్ష్యంతో, అహంతో ఇవ్వరాదు**

**శ్రియాదేయం - మనకున్న సంపదతో సరితూగగలిగేరీతిలో దానం చెయ్యాలి.**

**హ్రియాదేయం - ఇంతే ఇవ్వగలుగుతున్నానే సిగ్గుతో ఇవ్వాలి - అన్నది శాస్త్ర విధి. అలా చేద్దాం.**







# ఆశ్రమ భిక్ష పథకం



# అన్నదాన పథకం

శ్రీ సాయీ సేవా సమితి వారి ఆశ్రమం "సాయిధామం"లో అన్నదాన పథకం నడుస్తున్నది. అన్ని దానాల్లోకి అన్నదానం పుణ్యప్రదమని పెద్దలంటారు. శ్రీ సాయికి అన్నదానాలు చాలా ప్రీతిపాత్రం. ఆకలిగొన్న ఎవరికి అన్నం పెట్టినా అది నాకే చెందుతుందని బాబా కంఠోక్తిగా చెప్పారు. తను మాత్రమే వండుకొని తినడం పాపమని గీత చెప్పింది. అన్న దానాన్ని మించిన దానం లేదని అన్ని శాస్త్రాలు అంటున్నాయి. అందుచేత సాయీ భక్తులైన వారికి యీ పుణ్యప్రదమైన అవకాశం కల్పించటం కోసం ఈ పథకం రూపొందింపబడింది.

సభ్యత్వంగా రూ.6,116/-లు చెల్లించిన వారు యీ పథకంలో సభ్యు లవుతారు. సంవత్సరానికొకసారి చొప్పున వారి పేరిట (వారు కోరిన తేదీన గోత్ర నామాలతో) శ్రీ సాయి అర్చన జరుగుతుంది. అదేరోజు వారి పేరిట ఆశ్రమంలో "భిక్ష" ఏర్పాటు చేయబడుతుంది. దీంట్లో వారు స్వయంగా కూడా పాల్గొనవచ్చు. ఆ రోజు వారిపేరు భోజనశాలలో బోర్డు మీద వ్రాయటం ద్వారా ప్రకటితమవుతుంది. సభ్యత్వపు రుసుము **"శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు"** పేరిట చెక్కుల ద్వారాగానీ, వ్యక్తుల ద్వారా గానీ పంపవచ్చు. సత్సంగాలలోనైనా యివ్వవచ్చు. ఈ పథకంలో చేరేవారు తమ చిరునామా, ఎవరి పేరుమీద జరగాలో వారి వివరాలు, చిరునామా, మొబైల్ ఫోన్ నెంబర్లు కూడా వ్రాసి పంపాలి.

సాయి బంధువులారా,

మీ పిల్లల జన్మదినాల పేరిటో, మీ వివాహ వార్షికోత్సవాల పేరిటో, గతించిపోయిన పెద్దల పేరిటో, మీ గురుదేవుల పేరిటో యీ పథకంలో మీరు భాగస్వాములు కండి. మీకు తెలిసిన వారికి కూడా యీ విషయం తెలియ జేయండి. ఆకొన్నవారి కడుపునింపి శ్రీ సాయినాథుల అపార కరుణకు పాత్రులు కండి. చిరునామా సాయివాణిదే.

**- ధర్మాధికారి, సాయిధామం,**
**శ్రీ సాయి సేవా సమితి ట్రస్ట్,**
**రామలింగంపల్లి పోస్టు, యాదాద్రి భువనగిరి జిల్లా-508126**

శ్రీ కృష్ణావతారం

# శాశ్వత ధర్మగోప్త



- రచన : భండారు సదాశివరావుగారు

**(గత సంచిక తరువాయి)**

యుధిష్ఠిరుల వారు మానసికంగా చాలా బాధపడుతున్నారు. కృష్ణుడు ద్వారకను విడిచి పదిహేను రోజులపైనే అయిందని వార్తలందాయి. ఆ వార్తల మాటేమిటి?'

'పదిహేను రోజుల ముందా? అయ్యా! ఇదేదో మోసంగా కనిపిస్తున్నది. యాదవ ప్రభువులంటే పడనివాళ్లు ఈ అపవాదు వ్యాపింపచేసి ఉంటారు' అని వాస్తవంగా చెబుతూన్న ధోరణిలో ఆ తాపసులలో, పెద్దవాడు 'మీరు హడావిడిగా అక్కడికి పరుగెత్తాలనే ఊహతో, అపహాసం పాలు గావాలనే కోరికతో పుట్టించిన అసత్యవార్త అని మాకనిపిస్తున్నది' అన్నాడు.

ధౌమ్యులవారు యుధిష్ఠిరుల వారి వద్దకు హుటాహుటిన వెళ్లి, తాను విన్నదంతా చెప్పాడు. ఆ తాపసులను యుధిష్ఠిరుని దగ్గరికి తీసుకొని వెళ్లాడు. యుధిష్ఠిరుడు ఆశ్చర్యచకితుడైనాడు.

'నేను నమ్మలేదు గురువర్యా! అయినా పరిస్థితి విషమిస్తే, కృష్ణునికి అండగా నిలిచేందుకు భీముణ్ణి, నకులుణ్ణి పంపుదామనుకున్నాను. అర్జునుడూ లేడు. భీమనకులులూ లేకపోతే ఇక్కడ జరుగుతూన్న నిర్మాణాదులు కుంటుపడతవని తెలుసు సరే. అయితే వారి ప్రయాణాన్ని ఆపుదాం'.

శకుని పంపిన దొంగ తాపసబృందం, పాండవుల రాజధానిలోని చారబృందం సహాయంతో ఈ వార్తను వ్యాపింపజేయడానికి పాండవులకు, యాదవులకు మధ్యన విభేదాలు పుట్టించడానికేనని, అందుకే అటు ఈ వార్త వ్యాపింపజేసి, పాండవులను ఎవరినీ ద్వారకకు పోకుండా చేసి, దుర్యోధనుణ్ణి పంపడానికి జరిగిన కుట్ర అని ఆ చారుడు కృష్ణునికి నివేదించాడు.





కృష్ణుడు మనసులో బాధపడ్డాడు. ఒక విధంగా ఆనందించాడు. ఆ చారుని పిలిచి ఈ వర్తమానం అంతా బలరామునికి విపులంగా విశదీకరించమని పంపాడు. దుర్యోధనుని పట్ల బలరామునికున్న విశ్వాసం ఈ సంఘటనతో తప్పక సన్నగిల్లుతుందని కృష్ణుడు అనుకున్నాడు. పాండవుల పట్ల ఏర్పడ్డ తిరస్కార భావం కూడా తొలగిపోవచ్చు.

మరునాడు ఉదయం ఆ చారుడు బలరాముని సందర్శించి తాను ఇంద్రప్రస్థ సమాచారం సేకరించింది సేకరించినట్లు వివరించాడు. 'పాండవుల కిప్పటికీ వాస్తవాలు తెలియవు ప్రభూ! వారు కృష్ణ, బలరాములు క్షేమంగా ఉన్నారని తెలిసి పరమానందభరితులైనారు. గండం గడిచినందుకు సంతోషించి, అర్జునుడు రాగానే ఇక్కడికి పంపడానికి నిశ్చయించుకున్నాడు. ధౌమ్యులవారు కూడా పరమానంద భరితులైనారు' అని చెప్పాడు.

బలరాముని మనస్సు చివుక్కుమన్నది. దుర్యోధనుడు ఇంత నీచానికి దిగుతాడా అని ఆగ్రహించాడు. తరువాత కృష్ణునికి తన మనఃక్లేశాన్ని గురించి తెలిపాడు.

'నిజంగా ఇంత దుష్టప్రకృతి అని అనుకోలేదు కృష్ణా! సుభద్రను అతనికిచ్చి వివాహం చేస్తే బాగుంటుందని కూడా నేననుకున్నాను. ఇంత విశ్వాసఘాతకం చేస్తాడనుకోలేదు' అన్నాడు.

'అన్నా! ఇక అతని ముచ్చట మరచిపోవటం మేలు. ఇదంతా ఆ శకుని నాటకం. మొదటి నుండి పాండవుల నెలాగైనా హతమార్చాలనే గదా వారి ప్రయత్నం' అని సర్ది చెప్పాడు కృష్ణుడు.

రోజులు గడుస్తున్నాయి. సుభద్ర ఆ తాపసికి సన్నిహితురాలైంది. ఒకనాడు ఆ తాపసిని అడిగింది 'మహాత్ములు మీరు. దేశ దేశాలు తిరిగానంటున్నారు కదా! మీరు పాండవ మధ్యముణ్ణి ఎక్కడైనా చూచారా?'

అర్జునుడు సమ్మోహకంగా నవ్వి, 'చూడడమేమిటమ్మా. అతడే నేను,

నేనే అతడనుకో' అని నర్మగర్భంగా మాట్లాడాడు.

సుభద్రకు గుండె కదిలింది. 'స్వామీ! అతడెక్కడున్నాడిప్పుడు. ఇంద్రప్రస్థంలో లేడట. తీర్థయాత్రలకు బయలుదేరాడట'.

'అవునమ్మా! తీర్థయాత్రలకి బయలుదేరి, తీర్థస్థలంలోనే చిక్కుపడ్డాడు. ఈ చిక్కు ఎలా తొలగించుకోవడమా అని అతని ప్రశ్న'.

సుభద్రకు ఆ తాపసి మాటలలో ఏదో రహస్యం ధ్వనించింది. అతణ్ణి తదేకంగా చూస్తుంటే ఆమె ముఖం కందిపోయింది. ఒక కొత్త వెలుగు కనిపించిందామెకు. 'స్వామీ! మీరు మీరే'... అని గద్గదంగా ముఖంలో చెమటలు పోసి తలదించుకున్నది.

'ఇన్నాళ్ళు నన్ను గుర్తించలేదా సుభద్రా. నీ కోసం కాదా ఈ తపస్సు' అని అర్జునుడు స్నేహపూర్వకంగా అన్నాడు.

సుభద్ర సిగ్గుతో లేచి, తలను సవరించుకొని, వెంటనే సౌధాంతర్భాగానికి పరుగెత్తుకొని వెళ్లి శ్రీకృష్ణుని నివాసంలోకి చేరింది.

'అన్నా! ఇదా నీ దొంగ చేష్ట! ఇన్నాళ్లు నన్ను ఆయన దగ్గర ....'


'చెల్లీ! ఇదంతా నీ కోసమే కదమ్మా నీవే అతణ్ణి అర్జునుడని గుర్తుంచుకున్నావు కదా!'

ఆ యతి అర్జునుడు అని గుర్తించినప్పటి నుండి సుభద్ర అటు వెళ్లడం మానింది. ఎలాగైనా అతనిని భర్తగా పొందాలనే తపన ప్రారంభమైంది. తాను అర్జునుడున్న విశ్రాంతి గృహానికి ఇక వెళ్లలేదు. కులీన యువతికి అది మర్యాద కాదు. మరి తెలిసిన తర్వాత చూడకుండా ఉండలేదు. క్రమంగా ఆమె మనస్సును తాపం ఆవరిస్తూ వచ్చింది. అన్నం సహించదు. సంగీతం రుచించదు. స్నేహితురాండ్ల సాంగత్యానికి పులకించదు. ఆ నిట్టూర్పులు, ఆ లోలోపలి గుసగుసలు రుక్మిణీ, సత్యభామలు గుర్తించారు. ఇక ఎక్కువకాలం దాగుచేయడం సబబు కాదు. కృష్ణుడు ఆ యతి సపర్య నిమిత్తం రుక్మిణిని నియోగించాడు. సుభద్రకు బదులు రుక్మిణీ రావడం అర్జునునికి నచ్చలేదు. అతని ముఖంలో విరక్తి కనిపించింది.

**(సశేషం)**







# సాయిభక్త దాసగణు

**రచన : విజయ కిషోర్**

**(గత సంచిక తరువాయి)**

అదే విధంగా, ఒకసారి శ్రీమతి తర్కడ్ వద్దకు మాన్కర్ అనే భక్తుడు వచ్చి, తాను షిరిడీకి బయలుదేరుతున్నానని చెప్పాడు. వెంటనే ఆమెకు బాబా కోసమై ఏమయినా పంపించాలనే స్ఫూర్తి కలిగి ఇల్లంతా వెదకినా ఏమీ కనపడలేదు. చివరకు చేసేదిలేక అప్పటికే బాబాకు నైవేద్యంగా పెట్టబడిన ఒక చిన్న పేడాముక్కను బాబా కోసమై అతని ద్వారా పంపించింది. శిరిడీ వచ్చాక ఆ పేడాముక్కను బాబాకు సమర్పించడం మాన్కర్ మర్చిపోతే, బాబాయే స్వయంగా అడిగి మరీ ఆ పేడా ముక్కను తీసుకొని ఆరగించారు. తద్వారా భగవంతుడు భక్తుల భక్తి భావనకై ఎంత ఆకలిగొనియుంటాడో తమ చేతుల ద్వారా చెప్పకనే చెప్పారు. ఆ విధంగా, తనను తాను మరచిన తన్మయత్వంలో భక్తునిలో జాగృతమయ్యే ప్రేమ (భక్తి) భావాన్ని సద్గురువు ఎంతో ఆర్తిగా, ఆతురతగా స్వీకరిస్తాడు. దైవ్ భావాంచ భూకేల (భగవంతుడు భక్తుని ప్రేమకై ఆకలిగొనియుంటాడు) అనే మహాత్ముల వచనోక్తిలోని భావం అదే! అంటే, సమాజంలో తమ పరపతికి, సంపాదనకు చిహ్నంగా ధన, కనక, వస్తు, వాహనాదులను సమర్పించే భక్తులకు బాబా గుడిలో ప్రాముఖ్యం ఉంటుందేమో కానీ, బాబా గుండెలో కాదు. అదే, హృదయం అంతా ఆవరించిన ప్రేమతో (భక్తితో) సమర్పించిన చిరు కూరగాయలనయినా, చిన్న పేడా ముక్కనయినా ఆ సద్గురువు ఎంతో ప్రీతిగా స్వీకరిస్తారు.

అంతేకాదు, భక్తులు వారి ఇచ్ఛానుసారం సేవ చేసుకునేటప్పుడు, అందులో స్వచ్ఛమైన భక్తి ప్రేమలు మిళితమై ఉన్నప్పుడు, ఆ సేవ వలన

తాము బాధ అనుభవించవలసి వచ్చినా బాబా సంతోషంగా భరించారు. క్రమం తప్పకుండా ప్రతిరోజు ఎంతో భక్తిశ్రద్ధలతో బాబాకు వీడా (తాంబూలం) తెచ్చిచ్చే మావిసీబాయి, బాబా వీపు, కడుపు కలిసిపోయేంత బలంగా మర్దన చేస్తుంటే, ఆమె భక్తి ప్రేమలను ఆస్వాదించారే కానీ, "అలా చేయవద్దు" అని వారించలేదు. అలా వారించడానికి ప్రయత్నం చేసిన భక్తుల పట్ల తమ అసంతృప్తిని తమ శరీరాన్ని ఇంకా బాధించుకొని వ్యక్తపరిచారు. తద్వారా, సాటి భక్తుల భక్తి వ్యక్తీకరణలో జోక్యం కూడదని తమదైన శైలిలో హెచ్చరించారు. సరి!

**దాసగణు-ఆధ్యాత్మిక రచనలు :**

ఉద్యోగానికి రాజీనామా చేసాక, తరువాతి రోజులలో దాసగణు తన పూర్తి కాలాన్ని పారమార్థిక రచనలు చేయడంలో మరియు మధ్య భారత ప్రాంతమంతా విస్తారంగా పర్యటించి కీర్తనలు చేయడంలో పునీతం చేసుకున్నాడు. తరచూ బాబా దర్శనానికై శిరిడీ వచ్చి, కొంతకాలం బాబా సన్నిధిలో గడపడం చేసేవాడు. శిరిడీలో ఉన్నప్పుడు తన బస విఠల మందిరంలో ఉండేది. బాబా కూడా దాసగణుని ఎక్కువసేపు తమ వద్ద కూర్చోనిచ్చేవారు కారు. "గణూ, వెళ్ళి నీ పని చూసుకో" అని చెప్పి పంపించేవారు. అలా దాసగణు ఎన్నో అద్భుతమైన ఆధ్యాత్మికమైన రచనలను గావించారు. వాటిలో చాలా మటుకు మరాఠీ భాషలోను, కొద్ది మటుకు హిందీ భాషలోను ఉన్నాయి.

అహ్మద్ నగర్ జిల్లాలోని తలహాబాద్ గ్రామానికి చెందిన మహీపతి అనే పురాణకర్త (1715-1790) 13వ శతాబ్దం వరకు పరిఢవిల్లిన మహాత్ముల చరిత్రలను గ్రంథస్థం చేసాడు. ఆయన రచనలలో "భక్త విజయం" ఎంతో ప్రాచుర్యమైనది. మహీపతి తరువాత మహాత్ముల జీవన చరిత్రలను గ్రంథస్థం చేయడంలో అంతటి సఫలీకృత దాసగణుకే దక్కిందని ఆనాటి ప్రజాభిప్రాయం. అందువలననే దాసగణు ఆర్వాచీన్





(ఆధునిక) మహీపతిగా ప్రజాబాహుళ్యంలో ప్రసిద్ధికెక్కాడు.

దాసగణుకి సంబంధించి ఇంకొక గొప్ప విశిష్టత ఏమిటంటే, తన రచనా సామర్థ్యం మహాత్ముల చరిత్రను గ్రంథస్థం చేయడంతోనే సంతృప్తి చెందలేదు. సంస్కృత భాషలో మరియు మహా కఠినమైన గ్రాంథిక మరాఠీ భాషలో, నిగూఢమైన రీతిలో గొప్ప పారమార్థిక రహస్యాలను కలిగియున్న ఆధ్యాత్మిక గ్రంథాలలోని సారాన్ని సులభమైన మరాఠీ భాషలోకి సరళీ కరించి, సామాన్య ప్రజానీకానికి చేరువ చేసాడు. దాసగణుకి సంబంధించి ఇదొక అనుపమానమైన పారమార్థిక సాహితీ సేవగా జిజ్ఞాసువులైన (మరాఠీ) భక్తులు నేటికీ కొనియాడుతారు.

వాటిలో ముఖ్యంగా ఈశావాస్యోపనిషత్తులోని 18 సంస్కృత శ్లోకాల యొక్క భావార్థాన్ని బోధిస్తూ, ఛందోబద్ధంగా సరళమైన మరాఠీ భాషలో "ఈశావాస భావార్థ బోధిని" అనే గ్రంథాన్ని మరియు సంక్లిష్టమైన రీతిలో అపారమైన పారమార్థిక సత్యాలను బోధిస్తూ శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్ మరాఠీ భాషలో రచించిన "అమృతానుభవం" అనే గ్రంథంలోని ప్రతి ఓవికి భావార్థాన్ని వివరిస్తూ టీకా గ్రంథాన్ని దాసగణు వ్రాసారు. దాసగణు ఈ రెండు గ్రంథాలను వ్రాయడానికి ఉద్యుక్తుడై, మధ్యలో అశక్తుడైన సందర్భంలో బాబా తమదైన అద్భుత శైలిలో వాటి భావార్థాన్ని బోధించి, తమ అనుగ్రహంచే ఆ గ్రంథాలను దాసగణుచే పూర్తి చేయించిన తీరు ఆచంద్ర తారార్కం భక్తుల హృదయంలో నిలిచిపోతుంది. ఆ వైనాన్ని తలుచుకున్న ప్రతిసారి తనువు పరవశిస్తుంది. ఫలితంగా హృదయంలో సాయి నామం ప్రతిధ్వనిస్తుంది.

**ఈశావాస్యోపనిషత్తు - దాసగణు పనిపిల్ల :**

వేద, వేదాంగాలలోని సారమంతటిని ఏర్చి, అక్షరాలుగా కూర్చి, శ్లోకాలుగా పేర్చిన విశేషమే "ఈశావాస్యోపనిషత్తు" అని హేమాడ్‌పంత్ సాయి సచ్చరిత్రలో వ్యాఖ్యానిస్తారు.

**(సశేషం)**

# శ్రీ సాయి నిత్య పారాయణ గ్రంథము



## భక్తి పద్య కావ్యము

రచన : "రంగరాయ" బిరుదాంకిత **శ్రీ మండువ రంగారావు**

(గత సంచిక తరువాయి)

తే.గీ. ఆగని విరోచనములతో అలమటించు
చున్న కాకా మహాజను జూసి సాయి
కోపగించుకొని యరచె-కోరిపిలచి
శనగకాయలు తినిపించె శాంతి బడయ. 12

తే.గీ. బాబ కోపించు టెల్లను బాగు కొఱకె
కోపగించగ విపరీత ముపశమించు
వేరుశనగకాయల మందు, వెత విరోచ
నములు బాప గలదె నెటనైన నెరుగ. 13

తే.గీ. ఉదర రోగము-పదునాల్గు వత్సరములు
హరదవాసి దత్తోపంతు-అలమటిస్తు
బాధ భరించె నెటులనో-బాబ సాయి
యూది యాశీస్సులొసగగ-నుపశమించె. 14

ఆ.వె. రెండు వత్సరములు బాధపడెను, సాయి
యాజ్ఞ, సోనాముఖి తినగ నంతమయ్యె
మాధవుని గడ్డు రోగము సత్వరమున
సాయి మాటయె మందగు శాంతిబడయ. 15

ఆ.వె. కడుపు నొప్పి బాధ గంగాధరుకు, సాయి
చేతితో తడుమగ చెదరిపోయె
కడుపు నొప్పి బాధ కలిగిన నానాకు
నేతిబర్ఫి దినగ నెమ్మదించె. 16





ఆ.వె. చిత్ర మగుచు నుండు శ్రీసాయి వైద్యము
చిద్విలాస మతని చిత్తమెపుడు
రామభద్రు డతడు రాజిల్ల ధర్మాన
కృష్ణుడగును నీకు కృపను జూప. 17

## 20. కాంచనమును వీడ కష్టమగును

ఆ.వె. సాయి మాట చాలు- సాయి కృపను బొంద
యెంత రోగమైన యేమిగాదు
మందుయైననెట్టి మాట వేదమగును
తగ్గి తీరవలయు తక్షణంబ. 1

తే.గీ. భోజన విధాన, మాహ్వాళి, బోధనలను
ప్రాకృతికములై యుండుచు పరమ సాధు
జీవనము గడుపుచు- సాయి జీవితమును
మనన జేయుచు పూజించు మనుజు విడడు 2

తే.గీ. నిరత మానందమున నుండు నిర్మలుండు
భక్తులను పరమానంద భరితుజేయు
సాధురూపుని సాయిని సద్విలాసు
మరువగలరెట్లు గుండెలో మసలుతుండ 3

తే.గీ. కర్మ కర్తవ్య బోధల కథలు జెప్పి
కలుగ సుఖజీవనము వారి గాథలమర
మార్గ నిర్దేశనము జేసె మరల చావు
పుట్టుకలు లేక పరమేశు పొందునటుల 4

ఆ.వె. సుకృత దుష్కృతముల సువిచార గణనన
గలుగు చుండు జన్మ కడమ దనుక
భక్తి శ్రద్ధలుండి భగవంతు గొలిచిన
జన్మ సఫలమగును జనన ముడిగి. 5 (సశేషం)

# PRAYER AND ITS EFFICACY

(contd from last month) - N.N. RAJAN

A Greek proverb says : “When the gods were angry with a man, they gave him what he wanted. “Many of us have lived to be thankful that our prayers were denied.

“The divine promise ---- ask and ye shall receive ---- does not guarantee that you will receive exactly what you ask for”.

“The wise person adds a provision to every request, (if at all made), ‘Nevertheless, not my will, but Thine be done”.

Prayer in its true form is the daily or even hourly acknowledgement of God’s glory to which we surrender ourselves, heart and soul. We praise even petty mortals for small gains. God is the maker of this Universe. To Him our love should turn; and we should leave the rest to Him.

Once a mendicant went to emperor for alms. The emperor asked him to wait while he prayed to God saying, “Oh God, give me more and more wealth and other things”. The medicant who heard the text of the prayer began to leave the place. The emperor asked him why he was going. The beggar replied : “You are yourself begging for wealth and other possessions from God; I find you are a greater beggar than myself. I shall rather beg of God than of another beggar”. So saying the mendicant left the palace.

For one who is disciplined and self-controlled, prayer is easy and will be effective, If we are free from guile, we can quickly realise





the flow of love from God. How can we experience this unless we give our whole mind to Him? We should not allow even great calamities to diminish our faith in God and stand in the way of prayer. Prayer should form part of our daily discipline and be regarded as the foremost duty. The best form of prayer, however, does not include representation of difficulties and wants. It leaves everything to God to be solved in His own way. Mass prayer by an assembly of all the members in a family, at regular hours, is diffinitely effective.

The grace of God, like the rays of the Sun, knows no discrimination, for it falls alike on young and old, learned and ignorant, poor and rich, upon all those who long for Him. It is like a mother who loves all her children equally without any partiality.

While you are working, give your hands to work but place your mind on God. A man who is returning home with his mind filled with the thoughts of his erstwhile toils of the day, while talking to his friends accompanying him, correctly reaches his home, turning duly in all the corners and lanes on the way. He is able to do this without any special effort and he does not err even when his mind is wandering. If this is possible --- and we find it possible --- why is concentration on God not possible simultaneously with the performance of our routine duties?

We should remember God both in our happiness and in our sorrow. Only ignorant people attribute their miseries to God. Prayer is again that attitude of mind which enables us to take pleasure and pain in happy equanimity. The Gita says : -

"He who does not follow the cycle thus set in motion, O son of Pritha, is sinful and self-indulgent and lives in vain", -Gita Ch.III-16

An unbroken memory of God should be possible for everyone. When the mind dwells on God, a man's work will automatically go on smoothly and uninterruptedly.

Men should not do sinful acts. The truly religious man is one who does not do wicked deeds, even when he is not watched by others. Doing things against one's conscience is dishonest. If a man reveres his conscience and acts truly, he can be called a virtuous man because he does not commit sins even when he is alone. He who can resist the temptation to do a wrong thing is a wise and honest man. God, being omniscient, witnesses all our acts unseen.

A boy who was intelligent and well-trained was once found alone in an orchard full of pears. A stranger who saw him there had a pleasant surprise, when he noticed that the boy did not make the least attempt to take any of the fruits. When the boy was asked why he had not taken any fruit even when nobody was there to watch him, he replied quickly : "Yes, there was; I was there to see myself and I don't intend ever to see myself doing a dishonest act". This shows that the boy, though young, was obeying the dictates of his conscience. conscience is the inner voice of the Self within, which would never allow an ndividual to act wrongly.

We may therefore conclude that every activity in the world derives its motive power from God and that even the smallest thing will





not move without the will of God.

**Spiritual Discipline :**

Spiritual discipline is entirely different from religious life. We should not rest content with mere prayer, worship and other rituals. Of course, these acts may bring purity of mind and other merits. But there is something above all these which will take us to the ultimate Reality.

Being endowed with the power of discrimination, we should analyse the real and the unreal, without mistaking the chaff for the grain. Wisdom lies in choosing the proper way for obtaining the key to open the gates for spiritual enlightenment which will confer eternal Bliss. This will wipe out the cycle of Birth and Death. Virtuous acts done with a motive may bring heavenly enjoyments like the earthly ones. When merits are exhausted, men are pushed down on the earth again to roll and whirl in the cycle of birth and death. The Bhagavad Gita says :

"Having enjoyed the vast realms of Heaven, they nearly exhaust the stock of merit and will be obliged to come down into the mortal world again. Those who hanker after enjoyments and follow the ritualistic path of the three branches of knowledge (Vedas), will obtain temporary results. They go to Heaven and come down to Earth and revolve likewise". - Gita IX - 21

Spiritual practice is a constant and unremitting effort, persistent and tenacious.

# అనఘా వ్రత మహిమ

- ఇమ్మిడిశెట్టి ప్రభాకరరావు

'అఘము' అంటే పాపము. మనోవాక్కాయ కర్మలుగా అది మూడు విధాలు. అఘమును నాశనం చేసే వ్రతం కాబట్టి ఇది 'అనఘా వ్రతం'. 'అనఘుడు' అంటే దత్తాత్రేయుడు. 'అనఘ' అంటే లక్ష్మీదేవి. అనఘుడు ఉపదేశించిన వ్రతం కాబట్టి అనఘా వ్రతం. అనఘాదేవిని ఆరాధించేది కాబట్టి అనఘా వ్రతం. ఇలా మూడు విధాలుగా సార్థక్యం ఉంది. మార్గశీర్ష బహుళ అష్టమిని 'అనఘాష్టమి' అంటారు.

దత్తాత్రేయ స్వామి చిన్న వయస్సులో ఉన్నప్పడే ఆయన మహిమలు, యోగసిద్ధి మరియు జ్ఞానం చూచి ఆకర్షితులైన కొందరు మునీశ్వరులు శిష్యులుగా చేరి, జ్ఞానోపదేశము, ఆత్మయోగం పొందాలని ఆయన నాశ్రయించారు. వారిని పరీక్షించదలచి దత్త స్వామి వారినందరినీ ఒక సరస్సు దగ్గరకు తీసుకువెళ్ళారు.

తరువాత వారందరూ చూస్తుండగా నీటిపై నడుచుకుంటూ ఆ సరస్సు మధ్యలోనికి దిగి అంతర్థానమై, ఆ సరోవర జలగర్భంలో సమాధిలో మహా నందమయుడై ఉండిపోయారు. ఆయన పట్ల ఉన్న ఆకర్షణతో త్రిలోక సమ్మోహనమైన ఆ రూపాన్ని తలచుకుంటూ వారా సరస్సు తీరంలోనే నిరీక్షిస్తూ ఉండిపోయారు.

అలా నూరు సంవత్సరాలు గడిచాయి.

ఇంతలో దత్తాత్రేయ స్వామి తన మూలాధారం నుంచి సహస్రారం వరకు ఏడు యోగ చక్రాలలోనూ వ్యాపించియున్న తన యోగశక్తిని వెలుపలకు ఆకర్షించారు. ఆ శక్తి ఒక ఋషికన్య రూపంలో స్వామి నుండి బయల్వెడలి ఆయనకు నమస్కరించింది.

స్వామి ఆమెను "అనఘా!" అని సంబోధించి, "నీవు నా శక్తివి. అంటే





నిజానికి నేనే నీవు, నీవే నేను. నీవు నాలోనే అంతర్లీనమై ఉన్నప్పడు నన్ను దత్తాత్రేయుడంటారు. అప్పడు నేను అవధూత యతిని. నీవు నాలో నుంచి వేరై ఈ రూపం ధరించినప్పడు నీవు నా భార్యవు. అప్పడు నా పేరు 'అనఘుడు'. అది గృహస్థ రూపం. నీవు పుణ్యాత్ములకు ఋషిపత్ని లేక ఋషిహితవుగాను మరియు మలినాత్ములకు, అర్హత లేని వారికి నర్తకిగాను దర్శనమిస్తావు. నిజానికి ఈ మార్పు నీలో వుండదు. చూసే వారి దృష్టిలోనే ఉంటుంది, అంతే!

ఇక నుంచి భక్తుల పాపాలను పారద్రోలడం, దుష్ట సంహార కార్యం, సాధు సత్పురుషుల కష్టాలు తొలగించడం మొదలగు నా అవతార కార్యాలు నీ సహాయంతో నిర్వహిస్తాను. గట్టున వేచియున్న మునీశ్వరులను పరీక్షించి అర్హులైన వారిని అనుగ్రహిద్దాం పద" అని దత్తస్వామి అనఘా దేవి సహితుడై నీళ్ళపైకి తేలాడు.

స్వామి అన్నట్లే కొందరు మునులకు ఆ తల్లి నాట్యకత్తెగా కనిపించగా స్వామి దుష్టుడయ్యాడని అసహ్యించుకొని వెళ్ళిపోయారు. మిగిలిన వారికి ఆమె దివ్యశక్తి స్వరూపిణి అయిన ఋషిపత్నిగా దర్శనమిచ్చింది.

వారు ఆ లీలా దంపతుల చరణాలకు ప్రణమిల్లి వేనోళ్ళ స్తుతించారు. స్వామి కృపానుగ్రహాలు వారి మీద ప్రసరించి వారికి మహత్తరమైన యోగ సిద్ధి, తత్త్వ దర్శనం సిద్ధించి కృతార్థులయ్యారు. ఆనాటి నుంచి దత్త స్వామి అనేక లోక కళ్యాణ కార్యాలను అనఘామాత ద్వారా నిర్వహిస్తూనే ఉన్నారు. త్రిలోక కంటకుడై, దేవేంద్రుడికి సహితం అజేయుడైన జంభాసుర సంహారంలో ప్రధాన పాత్ర ఆ తల్లిదే కదా!

త్రేతాయుగారంభంలో హైహయ వంశజుడైన కృతవీర్యుడు మహా పరాక్రమంతో, ధర్మనిరతితో సప్త దీపావృతమైన మహీ మండలాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా డెబ్బది ఏడు వేల సంవత్సరాలు పరిపాలించాడు. కాని విధి వశాన చ్యవన మహర్షి వలన శాపోపహతుడై, నూరు మంది కుమారులు జన్మించినా ఆ రాజుకు ఒక్కరూ దక్కలేదు.

వంశోద్ధరణకై యాజ్ఞవల్క్య మహర్షి భార్య మైత్రేయి సలహాతో మహారాణి 'అనంత వ్రతం' ఆచరించింది. దేవగురువైన బృహస్పతి సలహాతో మహారాజు సూర్యోపాసన చేసి, సూర్యభగవానునిచే వరప్రసాదితుడై దత్తాత్రేయ స్వామి స్వయంగా ఉపదేశించిన 'సప్తమీస్నపన వ్రతం' ఆచరించాడు.

వ్రతఫలంగా వారికి ఒక కుమారుడు కలిగాడు. ఆ బాలుడికి 'అర్జునుడు' అని నామకరణం చేశారు. తరువాతి కాలంలో ఆ బాలుడు కృతవీర్యుని కుమారుడు కనుక కార్తవీర్యుడిగా, కార్తవీర్యార్జునుడిగా జగత్ప్రసిద్ధి చెందాడు.

పాపం ఆ పిల్లవాడిని పుట్టుకతోనే చొట్ట చేతులు, చచ్చు చేతులు. రాజు ఆ మనోవేదనతోనే కృంగి కృశించి కాలం చేశాడు. కార్తవీర్యుడికి చేతులు చచ్చువే కాని జ్ఞాన సంపద, ధర్మబుద్ధి, సునిశితమైన మేధా సంపత్తి మొదలైన ఇతర విషయాలలో అతనికి సరిసాటి ఎవరూ లేరు.

తండ్రి మరణానంతరం తన అవిటితనం కారణంగా కార్తవీర్యుడు పట్టాభిషిక్తుడవడానికి నిరాకరించాడు. దత్తాత్రేయ స్వామి అనుగ్రహం పొంది సమర్థత, యోగశక్తి సంపాదించమన్న గర్గముని సలహాపై వెళ్ళి దత్తస్వామి నాశ్రయించాడు.

అనఘాదేవితో కలిసి దత్తస్వామి ఎన్నో జుగుప్సాకర లీలలు ప్రదర్శించి కార్తవీర్యుణ్ణి కఠిన పరీక్షలకు గురిచేశాడు. దృఢమైన విశ్వాసంతో, సహనంతో అన్ని పరీక్షలకు తట్టుకుని నిలిచి అనితర సాధ్యమయిన సేవతో స్వామి అనుగ్రహానికి పాత్రుడయ్యాడు. స్వామి అమిత ప్రసన్నుడై వరాలు కోరుకోమన్నాడు.

"చొట్ట చేతులు స్థానంలో దృఢమైన చేతులే కాక అవసరమైనప్పుడు వెయ్యి బలమైన చేతులు రావాలి. యుద్ధంలో అప్రతిహతుడనవ్వాలి. అణిమాద్యష్ట సిద్ధులు, భూమ్యాకాశాలలోనే కాకుండ నీటిలో, నిప్పులో నిరాటంకంగా సంచరించే శక్తిని అనుగ్రహించు. నన్ను స్మరించినంతనే





నా రాష్ట్రంలో ప్రజలకు సకల భయాలు తొలగాలి. మారుమూలనున్న ప్రజల మనోభావాలు సహితం నాకు తెలియాలి. నా కోశాగారం ఎన్నడు తరిగిపోరాదు. నాకు ఎల్లవేళలా సత్పురుషులు అతిథులుగా లభించాలి. సదా నీ పాదపద్మములయందు నిశ్చలమైన భక్తి పెంపొందే వరమియ్యి. లోకోత్తరుడైన మహాపురుషుడి చేతిలో మరణం ప్రసాదించు" ఇత్యాదిగా ఇంకా ఎన్నో వరాలు కోరుకున్నాడు.

అప్పుడు దత్తస్వామి "కార్తవీర్యా! సాటిలేని భక్తితో నీవు నన్ను సేవించిన ఫలితంగా నీకు ఎన్ని వరాలిచ్చినా తక్కువే. అందువలన నీవు కోరిన వరాలే కాక మూడు లోకాలలోనూ యథేచ్ఛగా సంచరించగల దివ్యమైన రథాన్ని నాకు నేనుగా నీకు ప్రసాదిస్తున్నాను" మరో విశేషం విను.

"ఇన్ని అపూర్వ వరాలు నీవు పొందిన ఈ రోజు నిజానికి నీకేకాదు లోకానికంతటికి మహా పర్వదినం. ఈనాడు మార్గశీర్ష బహుళ అష్టమి. సువర్ణమునకు కాంతి, చంద్రునికి వెన్నెలలా సదా నన్ను ఎడబాయని అనపాయినియైన ఈ సాధ్వి పేరు 'అనఘ'. మా ఇరువురి సంతానమే అష్టసిద్ధులు. నన్నీ అనఘాదేవి సమేతంగా నీవు ఉపాసించి అష్టసిద్ధులు, ఇతర వరాలను పొందిన ఈ రోజు 'అనఘాష్టమి' అని ప్రసిద్ధి గాంచి, నాకత్యంత ప్రియమైన రోజు అవుతుంది.

ప్రతి సంవత్సరం ఈనాడు అనఘాదేవి సమేతుణ్ణైన నన్నర్చించి, 'అనఘా వ్రతం' చేసే వారికి మనో వాక్కాయముల వలన కలిగే మూడు రకాల పాపాలను భస్మీపటలం చేసి వారినఘుల్ని (పాప రహితుల్ని) చేస్తాను. అందుచేత కూడా ఈ వ్రతానికి 'అనఘాష్టమీ వ్రత'మని సార్థక నామమేర్పడుతుంది.

ఈ రోజున అనఘాదేవితోను, అష్టపుత్రులతోను కలిసిన నా ప్రతిమలను దర్భలతో చేసి, మంటపంలో పెట్టి, లేదా కలశాలలో అవాహన చేసి, భక్తి ప్రపత్తులతో విధి విధానంగా కలశ పూజ, షోడశోపచార పూజ చేసి గంధ, ధూప, దీప, మాల్యాదులర్పించి, నామార్చనలు చేసి, భజనలతోను,

'ఓం అతో దేవా అనంతునో యతో విష్ణుర్విచక్రమే' ఇత్యాదిగా ఋగ్వేద మంత్రాలతోను అనఘుడి రూపంలోనున్న శ్రీ మహావిష్ణువునైన నన్ను, అనఘాయైన లక్ష్మీదేవినీ ఆరాధించాలి.

ఆ ఋతువులో దొరికే కందమూల ఫలాలను, సుగంధ పరిమళ భరిత పుష్పాలను సమర్పించాలి. ఇలా నన్ను సేవించే వారికి ఇహపరాలలో ఏ లోటు రానివ్వను. నా తత్వం గ్రహించకుండా నన్నవహేళన చేసే వారిని శిక్షిస్తాను. అజన్మాంతం ప్రతి సంవత్సరం విడువక నియమంగా ఈ వ్రతాన్ని ఆచరించిన పుణ్యపురుషుడికి నేనే స్వయంగా వశమై వారి కుటుంబానికి సర్వతో ముఖాభివృద్ధి, ఆయురారోగ్యైశ్వర్య భోగభాగ్యాలు ప్రసాదిస్తాను. వాడికటు ఏడు తరాలు ఇటు ఏడు తరాలు ముక్తి ననుగ్రహిస్తాను. ముందు తరాల వారికి పూలబాటగా, వరాలమూటగా ఇది నీ వలన లోకానికంత టికీ లభిస్తున్న గొప్ప మేలు" అని వరప్రదానం చేశారు దత్తస్వామి.

తర్వాత కార్తవీర్యుడు ఈ వ్రతాన్ని తానాచరిస్తూ, తన రాజ్యంలోని ప్రజలందరి చేతా ఆచరింపజేశాడు.

**తేనేయం వరలబ్ధేన కార్యవీర్యేణ యోగినా ।**
**ప్రవర్తితా మర్త్యలోకే ప్రసిద్ధాహ్యనఘాష్టమీ ॥**

కార్తవీర్యార్జునుడు మహా మహిమాన్వితుడైన యోగి, దత్త యోగీంద్రుని అనుగ్రహంతో మర్త్యలోకంలో ప్రవేశపెట్టిన విశిష్ట మహావ్రతం ఈ 'అనఘాష్టమీ వ్రతం'. శ్రీకృష్ణ పరమాత్మ ధర్మరాజుకి ఈ వ్రతమహిమను, ఆచరించే విధానాన్ని వివరించి "నువ్వు కూడా ఈ వ్రతాన్నాచరించు. కార్తవీర్యార్జునుడంతటి వాడివవుతావు" అని దీవించినట్లుగా భారతం చెపుతుంది.

మహా మహిమాన్వితమైన ఈ అనఘాష్టమీ వ్రతాన్ని ఆచరించి దత్తాత్రేయ స్వామి కృపా కటాక్షములకు పాత్రులమయ్యెదము గాక! అనఘా వ్రతాలు సామూహికంగా చేసుకోదలుచుకున్నవారు సాయివాణికి లేఖలు వ్రాయండి. (తేది, సంఖ్య, ఊరి వివరాలు వ్రాయాలి).





# అసూయ

- శ్రీ విద్యాప్రకాశనందగిరి స్వాముల వారు

ఒక మహావృక్షము కలదు. అది శాఖోపశాఖలుగా విస్తరించి ఫల పుష్ప సమన్వితమై కళకళలాడుచు, చూపరులకు పరమానందం గొల్పు చుండెను. ఆకస్మాత్తుగా ఒక దినమున అది శుష్కించిపోయెను, కారణం ఎవరికినీ బోధపడకుండెను.

సర్వాంగ సుందరమై విలుసిల్లు ఆ వృక్ష రాజమున కట్టి దీనదశ ఏల సంభవించెనో జనులకు విదితము కాలేదు. అత్తరి యొక వృక్ష శాస్త్ర జ్ఞుడు అచటికేతెంచి యా పాదమును చక్కగ పరీక్షించి, దాని జీర్ణదశకు కారణమరసెను. ఒక వేరు పురుగు లోన ప్రవేశించి, ఆ చెట్టును లోపల లోపలనే గుల్ల చేసి వైచెను. అది అసలు సంగతి.

అట్లే కొందరు వ్యవహార రంగమునకు, మరికొందరు పరమార్థ క్షేత్రమునకు తమ ప్రయత్నాతిశయముచే మహోన్నత స్థితిని చేపట్టినను, గొప్ప స్థానమలంకరించినను, ఆకస్మాత్తుగా పతనమైపోవుచున్నారు. దీనికి కారణమేమి?

వారిలో ఒక వేరు పురుగు ప్రవేశించుచున్నది. అదియే అసూయ. అది ప్రవేశించి వారిలోనున్న సద్గుణరాశినంతను బూడిదపాలు చేసి వైచు చున్నది. అపుడు మానవుడు దానవుడుగా రూపొందుచున్నాడు. కాబట్టి ముముక్షువులీ పరమశత్రు విషయమై కడు జాగరూకులై మెలగి అద్దాని నెన్నడును దరికి జేరనీయక చూచుచుండవలెను.

జనులలో మూడు తరగతుల వారు కలరు. కొందరు పరుల ఔన్నత్యము నకు కారకులై, వారు వృద్ధినొందుటను జూచి పరమానందపడు చుందురు. వీరు ఉత్తమ తరగతి వారు, మరికొందరు ఇతరుల అభివృద్ధికి ఏమాత్రం సహాయము చేయక తమ అభివృద్ధిని మాత్రం చూచుకొను చుందురు - వీరు మధ్యమ తరగతి వారు. వీరి వలన పరులకు

ఉపకారం లేకపోయినను, అపకారం కూడ లేదు. కావున ఒక విధంగా మంచివారే యగుదురు.

ఇక మూడవ తరగతి వారు తాము ఉన్నతిని పొందక పోయినను ఒకరి ఔన్నత్యమును జూచి ఓర్చలేరు - వీరు అధములు. ఇట్టి అసూయా పరుల వలన సంఘమునకు తీరని కళంకం సంభవించుచుండును. ఇది చాలా హేయమైన ప్రవర్తన. అసూయాగ్రస్తుని బాధకు వేరు కారణ మేమియు ఉండదు. ఒకరు బాగుపడుటయే అతని ఏడుపుకు కారణం.

దుర్గుణములన్నిటిలోను ఈ అసూయ మహా ప్రమాదకరమైనది. శ్రీకృష్ణ భగవానుడు -

1. ఇదంతుతే గుహ్యతమం ప్రవక్ష్యామ్య నసూయవే.

2. న చాశుశ్రూషవే వాచ్యం నచమాం యోఽభ్యసూయతి.

అని గీతయందు వంచించినవాడై అసూయాపరులకు పవిత్రమైన శాస్త్రమును బోధించినను నిరుపయోగమగునని సూచించెను. అసూయ అనునది ఒక విధమైన కల్లు. అది త్రాగిన వారికి మంచి, చెడ్డ తెలియదు. సర్వభూతములందు వెలుగుచున్న పరమాత్మను వారు గ్రహించజాలరు. పరుల సుఖమును జూచి ఓర్చలేకుందురు.

పాత్ర మంచిది, పప్పు మంచిది, చింతపండు మంచిది, నీళ్ళు మంచివి, నిప్పు మంచిది, వండినవారు దక్షులు; అయినను వండిన పప్పు పులుసును త్రాగి అందరును వాంతి చేసుకొనిరి. కారణమేమి?

ఆ పాత్రకు లోన కళాయి లేదు. అదేవిధంగా ఎన్ని సుగుణములున్నను ఒక్క అసూయయను దుర్గుణమున్నచో ఆ వ్యక్తి లోకమునందు పతనమై పోవును. భగవద్ద్రష్ట యందు అతడు క్రమంగా తన పూర్వపుటౌన్నత్యమును గోల్పోవుచుండును.

ఇక, అసూయకు కారణమేమియో విచారించెదము. అజ్ఞానమే దానికి కారణము. ఎదుటివారు, తాము వేరువేరని తలంచుటయే ఆ దుర్గుణము నకు హేతువు. సర్వులయందును ఒకే భగవత్స్వరూపము వెలుగుచున్నదని తెలిసినపుడు, తన ఆత్మయే సర్వభూతాత్మయని గ్రహించినపుడు ఇక పరు





లను ఏల హింసించును? పరుల అభివృద్ధిని జూచి ఏల దిగుల నొందు చుండును?

**యస్మిన్సర్వాణి భూతాని ఆత్మైవా భూద్విజానతః**

**తత్రకో మోహః కః శోక ఏకత్వ మనుపశ్యత**

అను ఈశావాస్యోపనిష్మంత్రమీ సత్యమునే వెల్లడించుచున్నది. "ఓ జీవు లారా! సమస్త ప్రాణికోట్లయందును మీ హృదయాంతర్వర్తి యగు ఆత్మయే విరాజిల్లుచున్నదని తెలిసికొనినపుడిక కామము గాని, క్రోధము గాని, శోకము గాని, అసూయ గాని ఏల కలుగగలదు?" అని ఆ ఉపనిషత్తు జనులను నిలదీసి అడుగుచున్నది.

కాబట్టి సర్వాత్మ భావమును చక్కగా అలవరచుకొని సర్వత్ర ఏకత్వానుభవము గలవారై జనులు తమ యందలి ఈ అసూయాది పరమ శత్రువులను పారద్రోలి జీవితమును నిష్కంటకముగ, శాంతిమయ ముగ, పరమానంద ప్రదముగ నొనర్చుకొందురు గాక!

# గతం లేనిదే భవిష్యత్తు లేదు-వీర సావర్కర్

జీవనశైలి శుభప్రదంగా ఉండాలంటే చరిత్రను గురించి అవగాహన అవసరం.

చాలామంది అనుకుంటారు - జరిగిపోయినది నెమరువేసుకుంటే ప్రయోజనం ఏమిటి? అని.

ఈ రోజు మనం 'అనుభవం' అని దేన్నయితే అంటున్నామో అది గతమే. అనుభవం నేర్పిన పాఠాలు అని దేన్నయితే అంటున్నామో అవి గతం నేర్పిన పాఠాలే.

చరిత్ర మనకు చాలా జ్ఞానాన్నిచ్చింది. ఇంకా ఇవ్వగలదు కూడా. చరిత్ర అనేది చదువుకునే ఒక సబ్జెక్టు కాదు. అవగతం చేసుకుని అనుసరించా ల్సిన ఒక అంశం! మనం వినగలగాలే కానీ చరిత్ర ఎన్నో నేర్పిస్తుంది.

ముఖ్యంగా ఈ దేశ చరిత్ర ఈ దేశ ప్రజలకు ఎన్నో పాఠాలు చెప్పింది. ఇక్కడ చరిత్ర అంటే మన పట్ల విషం చిమ్ముతూ ఆక్రమణదారులను

ఆకాశానికి ఎత్తుతూ కమ్యూనిస్టులు రాసిన చరిత్ర కాదు. మన సంస్కృతిని హీనపరుస్తూ, మనలను కించపరుస్తూ, మన వైభవాన్ని చీకట్లోకి నెట్టేస్తూ రాసిన చరిత్ర కాదు.

చరిత్ర అంటే మన నిజమైన చరిత్ర తవ్వి వెలికితీసిన సత్యాలతో నిండిన చరిత్ర. అది మనలను పదే పదే హెచ్చరిస్తూ వచ్చింది! దానినే మనం అధ్యయనం చేయాలి. 2015లో అండమాన్ నికోబార్‌లో హిందూ సమ్మేళనం జరిగింది. ఆ సమ్మేళనానికి పూజ్యులు సాధ్వి ఋతంభర వచ్చారు. కార్యక్రమం తరువాత ఆమె అండమాన్ జైలుని సందర్శించారు. (ఇక్కడే ఆంగ్లేయులు 550 మంది భారతీయ యోధులని బంధించారు). ఈ జైలులోనే వీరసావర్కర్ పదకొండు సంవత్సరాలు బందీగా గడిపారు. అనేక హింసలకు గురి అయ్యాడు.

ఆయన ఉన్న గదిని చూడటానికి ఋతంభర వెళ్ళారు. ఆ గది 5 అడుగుల పొడవు, 6 అడుగుల వెడల్పుతో ఉంది. దానికి ఒక ఇనుప తలుపు ఉంది. అక్కడ రెండు మట్టి చిప్పలు ఉన్నాయి. వాటిని చూసి 'ఇవి ఎందుకు?' అని ఆమె అడిగారు ఋతంభర.

అక్కడే ఉన్న గైడ్ చెప్పాడు 'ఒక గిన్నెలో ఇంగ్లీషు వాళ్ళు తిండి పెడతారు'.

ఆమె అడిగింది 'మరి రెండవది ఏమిటి? అని.

'ఆ రెండవది మలమూత్రాలు విసర్జించడానికి'.

ఆమె నివ్వెరపోయారు.

చాప, దుప్పటి కూడా లేదు. ఈ చిన్న సెల్‌లో ఆయన 11 సంవత్సరాలు ఎలా గడిపారు? ఇంత దుర్మార్గమా?

గైడ్ వివరించాడు - 'ఆయన్ను బయటకు తీసుకువచ్చి ఎద్దుల బదులుగా ఆయన్ను గానుగకు కట్టి, నూనె తీయించేవారు. అది అయ్యాక నులకతాళ్ళు పేనమనేవారు. తాళ్ళు పేని పేని, ఆయన అరచేతులు పుళ్ళు పడిపోయేవి. చెప్పిన సమయానికి చెప్పిన తాళ్ళను అందించక పోయినా, నూనెను తీయలేకపోయినా ఇనుప కొరడాతో కొట్టేవారు'.

సావర్కర్ సెల్ ఎదురుగా ఉరికంబం ఉంది. ఋతంభర అడిగారు 'ఉరికంబానికి ఎదురుగా ఈయన్ని ఎందుకు ఉంచారు?' అని.

ఆంగ్లేయులు తమ మాట వినని వారిని ఇక్కడకు తీసుకువచ్చి





ఉరితీస్తూ ఉండేవారు. రోజూ అది చూస్తూ సావర్కర్ మనోబలం దెబ్బ తినాలని వారి ఉద్దేశ్యం అని గైడ్ చెప్పాడు. 'అలాంటి పరిస్థితులలో సావర్కర్ ఏమి చేసేవాడు' అని సాధ్వీ ఋతంభర అడిగారు. ఆయన తన గదిలో నుంచి ఉచ్ఛస్వరంతో 'వందేమాతరం, భారత్ మాతాకీ జై' అని నినాదాలు ఇచ్చేవాడు, అది విని ఉరికంబానికి ఎక్కేవారి మనసు ఉత్తేజం చెందేది' అని చెప్పాడు. అది విని సాధ్వీ అక్కడే కూలబడి పోయారు, విలపించారు.

'ఎందుకు ఏడుస్తున్నావమ్మా' అని గైడ్ అడిగారు.

'ఆంగ్లేయుల కాలంలో ఒక్క మహిళ కూడా తన చరిత్రను కాపాడుకో లేకపోయింది. ఒక్క గోమాత కూడా పూజకు నోచుకోలేదు. ఒక్క మందిరంలో కూడా దీపం వెలగలేదు. ఒక్క ధర్మగ్రంథాన్ని కూడా చదువ లేకపోయారు'. బ్రిటిష్‌వారు ఎదురైతే రౌలత్ చట్టం ప్రకారం భారతీయులు మోకాళ్ళ మోజేతుల మీద నడుస్తూ వెళ్ళవలసిన పరిస్థితి ఉండేది. ఈ స్థితి నుండి సమాజాన్ని కాపాడడానికి ఎందరు మహా పురుషులు తుపాకీ గుండ్లకు బలయ్యారో, ఎందరు ఉరికంబాలనెక్కారో, ఎంతమంది జైళ్లలో కష్టాలు అనుభవించారో? వారు కష్టాలు అనుభవించి, మనకు ఈ స్వాతంత్ర్యాన్ని తెచ్చిపెట్టారు. దీన్ని కాపాడుకొనేందుకు ఈ రోజు మనం ఏమి చేస్తున్నాం?"

ఇదే ఆమె ఆవేదనకు కారణం.

మన వేల సంవత్సరాల చరిత్ర ఇలాంటి భయంకర సంఘటనలతో నిండి ఉంది. ఆ అనుభవాన్ని ప్రస్తుత మన స్వేచ్ఛను, మన శరీరాన్ని, మన స్సును, ధనాన్ని ఏ విధంగా వెచ్చించాలని మనం వివేకంతో ఆలోచించాలి.

**క్వచిత్ భూమౌశయ్యా క్వచిదపిచ పర్యంక శయనం**
**క్వచిత్ శాఖాహారి, క్వచిదపిచ శాల్యోదనరుచిః**
**క్వచిత్ కంథాధారి క్వచిదపిచ దివ్యాంబర ధరో**
**మనస్వీ కార్యార్థీ నగణయతి దుఃఖం నచ సుఖం**

ఒక కార్యాన్ని సఫలం చేయాలనుకున్నవాడు అవసరమైతే నేలపై-అవకాశముంటే పూలపాన్పుపై, చిరిగిన గుడ్డలైనా-పట్టు పీతాంబరాలైనా, ఆకులు అలములైనా-పంచభక్ష్య పరమాన్నమైనా సమానంగా చూసుకుంటాడు.

# ఎవరికెవరు ఈ లోకంలో

యౌవనంలో వ్యాపారాన్ని ప్రారంభించిన ఓ పారిశ్రామిక వేత్త అనతి కాలంలోనే కోట్లకు పడగలెత్తాడు. సమాజంలోని లొసుగులన్నీ ఉపయోగించుకొని, తన సామ్రాజ్యాన్ని విస్తరించుకున్నాడు. అప్పటి నుంచి సంఘంలో ఆయన హొదాయే మారిపోయింది. ఆయన దృష్టిలో పడేందుకు, ఆయనను మంచి చేసుకునేందుకు అయినవారు, బంధువులు ఆపసోపాలు పడేవారు. ఆ పారిశ్రామికవేత్తకు కుక్కలంటే మహా ప్రాణం. అదే ప్రీతితో విదేశాల నుంచి ఓ మేలురకం శునకాన్ని తెప్పించుకొని ఆత్మీయంగా పెంచుకునేవాడు. ఆయనను ప్రసన్నం చేసుకొని, ఏదైనా లబ్ధి పొందాలని ఆశించే వాళ్లంతా ఆయన బలహీనత శునకమని తెలుసుకొని, వచ్చినప్పడల్లా దానికి రకరకాల పదార్థాలు తెచ్చిపెట్టేవారు. అలా ఆయనకు దగ్గరవ్వాలని ప్రయత్నించేవారు. ఇలాంటి సమయంలో ఒకానొక దుర్దినం, ఆ కుక్క ప్రమాదవశాత్తూ చనిపోయింది. ఆ రోజు ఆ పారిశ్రామిక వేత్త ఇల్లు జాతరలా మారిపోయింది. పరామర్శలతో, పలకరింపులతో తడిసి ముద్దయిపోయింది. తన పట్ల వారందరూ కనబరుస్తున్న సానుభూతికి పొంగిపోయాడు; వారు చూపుతున్న ఆత్మీయతలకు కదిలిపోయాడు ఆ పారిశ్రామికవేత్త. అలా ఆయనను 'మంచి చేసుకొని' సదరు బంధుజన పరివారమంతా బాగుపడుతూ ఉండేవారు.

కొన్నాళ్లకు ఆ శ్రీమంతుడి ప్రాభవ వైభవాలన్నీ కాలగర్భంలో కలిసిపోయాయి; ఆస్తులన్నీ కర్పూరంలా కరిగిపోయాయి. బికారిలా మారిపోయాడు. వ్యాధులతో మంచానపడ్డాడు. కానీ, రాజభోగాలు అనుభవించేటప్పుడు కనిపించిన ఒక్కరూ ఇప్పడు ఆయన వైపు తిరిగి చూడటం లేదు. కుక్క చనిపోతేనే చూసిపోవడానికి బారులు తీరిన జనాలలో ఒక్కరు కూడా ఇప్పడు ఆయన మంచిచెడులు తెలుసుకునేందుకు ప్రయత్నించడం లేదు. ఈ ప్రపంచంలో ఆయనొకడు ఉన్నాడని కూడా ఆ జనం మరచిపోయారు. మరో ధనవంతుడి ఇంటి కుక్కల బాగోగులు చూసుకునేందుకు పరుగులు పెడుతున్నారు. ఇదీ మన నైజం. మిసలాడుతూ పైకి కనిపిస్తున్నా లోలోపల మాత్రం పురుగులతో లుకలుకలాడే మేడిపండు లాంటి పరివార జనం ప్రేమాభిమానాల గుట్టు విప్పతూ ఆదిశంకరాచార్యులు తన 'భజ గోవిందం'లో ...

**యావద్విత్తో పార్జనసక్త స్తావన్నిజ పరివారో రక్తః।**

**పశ్చాజ్జీవతి జర్జర దేహే వార్తాంకో2 పిన పృచ్ఛతి గేహే ॥**

“ధనాన్ని సంపాదిస్తున్నంత వరకే నీ బంధు మిత్ర పరివార జనం నీ పట్ల అనురాగాన్ని చూపిస్తారు. వార్ధక్యంలో నీ దేహం శిథిలమై శక్తి విహీనమైనప్పడు నీ ఇంట నిన్ను పలకరించేవారు కూడా ఉండరు” అంటూ హెచ్చరిస్తున్నారు.

**ఎవరికి వారే ... :** మోహావేశాలతో మనం పెంచుకుంటున్న మమకారాలు వాస్తవానికి మనల్ని మాయలో పడేస్తున్నాయి. అతి ప్రీతితో, అమాయకత్వంతో అసలు రహస్యాన్ని తెలుసుకోకుండా సంసారంలో పీకల లోతు కూరుకుపోతున్నాం. అలా అని చుట్టూ ఉన్న జనాన్ని చీదరించుకొమ్మనీ కాదు! వారిని ప్రేమించొద్దనీ కాదు! కానీ, వారికీ, మనకూ శాశ్వతానుబంధం ఉందని మాత్రం భ్రమించకూడదు. వారి తోటిదే లోకమని భావించుకోకూడదు.

“భార్యాపుత్రులు, తల్లిదండ్రులు అందరితో కలసిమెలసి ఉండు. అందరికీ సేవచెయ్యి. అత్యంత ఆత్మీయునిగా వారి పట్ల ప్రవర్తించు. కానీ మనస్సులో మాత్రం వీరెవ్వరూ నీ వారు కారని ఎరిగి ఉండు. ఇవన్నీ అనిత్యమేననీ తెలుసుకో! భగవంతుని పట్ల భక్తిని అలవరచుకోకుండా సంసారంలో దిగావంటే, ఇంకా బంధాల్లో ఇరుక్కుంటావు. ఆపద, దుఃఖం, శోకాలు ఎదురైనప్పడు మనఃస్థైర్యాన్ని కోల్పోతావు” అనేవారు భగవాన్ శ్రీ రామకృష్ణ పరమహంస. ఇలా అప్రమత్తంగా ఉండటమే జీవనధర్మం! దురదృష్టవశాత్తూ మనలో ఇంకా అంతటి వివేకం పొడసూపడం లేదు. బిడ్డల కోసం ఎంత ధనం కూడబెట్టినా వాంఛ తీరదు! పైగా ఒకానొక రోజు శరీరంలో శక్తి ఉడిగిపోయి మంచానపడ్డప్పడు, ఎవరి కోసమైతే ఈ తనువును గుల్ల చేసుకొని సంపాదించామో, వారు ఏ మాత్రం పట్టించుకోకపోతే దుఃఖపడతారు. అదే మాయ! మనస్సును ఈ బంధాలకు మించిన మరో ప్రపంచం వైపు నడిపించాలి.

ఎవరికి వారే అయిన ఈ లోకంలో ఎవరి కోసం మనం ఇన్ని తిప్పలు పడుతున్నామో ప్రశ్నించుకోవాలి. అందుకే జగద్గురువులైన శంకరాచార్యులు 'యావద్విత్తో పార్జనసక్త స్తావన్నిజ పరివారో రక్తః..' అంటున్నారు.

**పాపపుణ్యాలే మన వెంట ... :** ఆధునిక సమాజంలో పుత్రమిత్ర పరివార వ్యామోహం మరింత పెరిగిపోయింది. మిగతా వారిని ముంచైనా సరే 'మనవారు' సంపదల్లో, సౌకర్యాల్లో మునిగితేలాలని తాపత్రయపడు తున్నారు. నిజానికి 'మన వారంటూ' ఎవరూ లేరని తెలుసుకుంటే అడ్డదారులు తొక్కి అందలాలు ఎక్కే సాహసం చేయలేరు. పాపాలు చేసి కూడబెట్టిన సొమ్ములో వాటాలు పంచుకునేందుకే పరివారమంతా ముందుంటారు గానీ, పాపాల ఫలితంగా సంక్రమించే కష్టనష్టాల్లో మాత్రం ఏ ఒక్కరూ భాగస్వాములు కాలేరు. శంకరాచార్యులు నర్మగర్భంగా వివరించిన ఈ భజగోవిందంలోని ఆ నాలుగు పాదాలను స్ఫురింపజేస్తూ భక్త రామదాసు తన 'దాశరథీ శతకం'లో ...

**ఎక్కడ తలిదండ్రి, సుతులెక్కడివారు, కళత్ర బాంధవం**
**బెక్కడ జీవుడెట్టి తనువెత్తిన బుట్టుచు బోవుచున్నవా**
**డొక్కడె, పాపపుణ్య ఫల మొందిన నొక్కడె కానరాడు నే**
**రొక్కడు వెంట నంటి, భవమొల్లనయా, కృప జూడవయ్య నీ**
**తక్కరి మాయలందిడక దాశరథీ కరుణా పయోనిధీ ... అంటారు.**

'దశరథరామా! తల్లిదండ్రులు, కొడుకులు, భార్య అనేవారు కాలాను గుణంగా నడుమ వచ్చినవారు. కానీ, శాశ్వతంగా సంబంధం కలిగి ఉండేవారు కాదు. ఎందుచేతనంటే, ఒకడు పుట్టినప్పుడు, మరణించి నప్పుడు, పాపపుణ్య ఫలములను అనుభవించేటప్పుడు, తానొక్కడే అగును కానీ, తల్లిదండ్రులు తదితరులు రావడం కానీ, పోవడం కానీ సంభ వించదు. కాబట్టి అట్టివారితో సాంసారిక జీవనం అక్కరలేదు. నీవు నాతో లీలలు, మాయలు చేయక నిజంగా సంసారం నుంచి తప్పించి కాపాడుమా!' అంటూ వేడుకుంటాడు.

**స్వార్థాన్ని వీడితేనే సార్థకత ...:** మీ ద్వారా ఈ ప్రపంచంలోకి ప్రవేశించిన బిడ్డలను అనాథలుగా, అభాగ్యులుగా చేయమని జగద్గురువుల ఉద్దేశం కాదు. కానీ, ఆ పరివారం కోసం కొంత పరిమితిని విధించుకోవడం





అవసరం. కూడబెట్టి వారికి అతి భద్రత కల్పించి, వారిని సుకుమారంగా తయారుచేయకండి. సాహసవంతులుగా చేయాలిగానీ, పరాన్నజీవులుగా మార్చకండి. మీ వారిని మించి పరిధిని విస్తరించుకోండి. నిస్వార్థంతో సమాజానికి మన వంతు సేవ చేస్తే, ఆ పుణ్యఫలంగా భగవంతుడు మనల్ని భద్రంగా కాపాడుతాడు. కానీ దురదృష్టవశాత్తూ ఈ రోజుల్లో చాలావరకు మన విశాల హృదయాలు కుంచించుకుపోతున్నాయి. మన బిడ్డలు, బంధువులు తప్ప పరాయివారెవరూ మనకు కనిపించడం లేదు. మన కళ్ళ ముందు ఎందరో అనాథ పిల్లలు ఆకలితో అలమటిస్తున్నా, మనం కనికరించడం లేదు; మన పిల్లలకు మాత్రం అజీర్ణం చేసినా సరే, కుక్కి కుక్కి మరీ తినిపిస్తూ ఉంటాం. ఇక ఆ సంకుచితమైన, స్వార్థపూరితమైన చర్యలకు ఫలితాన్ని చివరిరోజుల్లో భగవంతుడు మనకు చూపిస్తాడు. ఒంటరిని చేసి ఆడిస్తాడు. అందుకే శ్రీమద్భాగవతంలో బలిచక్రవర్తి తన తాత ప్రహ్లాదుడి మాటలను గుర్తు చేసుకుంటూ ....

**చుట్టాలు దొంగలు, సుతులు ఋణస్థులు కాంతలు సంసార కారణములు**
**ధనము లస్థిరములు తనువతి చంచల; కార్యార్థు లన్యులు ...**

'చుట్టాలు దొంగలు, కొడుకులు అప్పులవాళ్ళు, భార్యలు ముక్తిని దూరం చేసేవారు. సంపదలు నిలకడలేనివి, శరీరం స్థిరం కాదు. ఇతరులు తమ ప్రయోజనం కోసమే మన దగ్గరకు వస్తారు...' అంటాడు. ఇలా స్వార్థపూరిత బంధాలను దాటుకొని విస్తరించినప్పడే మన జీవితానికీ, శ్రమకూ, సంపా దనకూ సార్థకత, మన సనాతన సాహిత్యంలో, ధార్మిక సారస్వతంలో సాంసారిక మోహపు తెరలను తుంచే ప్రయత్నంలో చాలా కఠినంగా హెచ్చ రికలు చేశారు. వారందరికీ కుటుంబ వ్యవస్థ పైన నమ్మకం లేకకాదు! దాన్ని నిరసిస్తూ కాదు. కుటుంబం, సంసారం పేరుతో మనిషి తన పరిధిని కుంచించుకుంటూ, స్వార్థపూరితుడిగా మారే ప్రమాదముందని ముందే ఊహించారు. అందుకే ఆ సంకెళ్లను ఛేదించే లక్ష్యంతో చర్విత చర్వణంగా తమ ప్రగాఢ భావజాలంతో మేల్కొలుపు పాడారు. కేవలం కుటుంబ సంక్షేమమే మీ లక్ష్యం కాకూడదనీ, పారమార్థిక పథం వైపు పయనించా లనీ హితవు పలికారు.